

# ఏది ధర్మం?

ధగేటి ఇందిరాదేవి

సెప్టెంబరు నెల - ఒకనాటి ఉదయం -

మెట్రిక్ పరీక్షలు జరుగుతున్నా యా కాలేజీలో.

ఒక హాలుకి ఇన్విజిలేటర్‌గా వచ్చింది పార్వతి.

వరండాలో - పుస్తకాలు పట్టుకొని నిల్చుండి, ఆఖరిసారిగా చదువుకుంటూ గొణగొణలాడుతూ ఉన్నారు. అందరి ముఖాల్లోనూ ఆదుర్దా వ్యక్తమౌతోంది.

సెకండ్ బెల్ మ్రోగింది -

విడవలేక, విడవలేక తమ పుస్తకాల నక్కడ విడచి హాలులోనికి అడుగుపెట్టారు.

"అలవాటుగాగానీ, పొరపాటుగా కానీ, ఎవరైనా కాగితాలు తెస్తే, ఇప్పుడే ఇచ్చేయండి - ఆ తర్వాత విచారించి లాభం లేదు" - అంటూ నిష్కర్షగా చెప్పేసింది పార్వతి.

ఎవ్వరూ మాట్లాడలేదు -

"అందరూ హాలు టిక్కెట్లు బయటికి తీసి ఉంచండి." హాల్ టిక్కెట్లు, హాల్ సీటింగ్ ప్లాన్ సరిచూసుకుని, గంట కొట్టగానే పేపర్లు ఇచ్చేసి, రాని వాళ్ల నంబర్లు రాసుకుని అంతా సరిగ్గానే ఉందని మళ్లీ ఒకసారి రూఢీ చేసుకుంది పార్వతి - ప్రతి విద్యార్థినీ పరీక్షగా గమనిస్తూ - తన కుర్చీలో కూర్చుండిపోయింది కాసేపు.

అంతా నిశ్శబ్దంగా ఉంది. తలలు పైకెత్తకుండా అందరూ గబగబా రాసుకుపోతున్నారు. పార్వతి లేచి హాలంతా కలియ తిరిగింది కాస్సేపు.

గ్యాలరీలో చివరి బెంచీ దగ్గరే ఉన్న కిటికీ దగ్గర నిలబడింది. అది మేడ మీది గది కావడంతో చుట్టు ప్రక్కల చాలా దూరం కనిపిస్తుంది.

మగత మగతగా ఒళ్లు విరుచుకుంటూ, జాగృత మవుతోంది ప్రకృతి - కాలేజీ ప్రహరీ గోడ నానుకుని నలు వైపులా విశాలమైన రోడ్లున్నాయి - వాటికి

ఒక వైపున నిద్ర గన్నేరు చెట్లు బార్లు తీర్చి నిలబడ్డాయి. అటువైపు మెడికల్ ఆఫీసరుగారి ఎత్తయిన బంగళా చూడ ముచ్చటగా ఉంది. గ్రౌండ్‌లో ఎన్. సి. సి. కాడెట్లు డ్రిల్లు చేస్తున్నారు. క్రమ బద్ధమైన వారి విన్యాసాల్ని కాసేపు రెప్పవేయకుండా చూస్తుండిపోయింది పార్వతి.

గంట మ్రోతతో ఉలిక్కిపడి టైమ్ చూసుకుంటూ క్లాసు వైపు తిరిగింది. అయిదు నిమిషాలు అలా నిలుచుండిపోయిందన్న మన్న కిటికీ దగ్గర. ఎంతసేపయితేనేం! విధి నిర్వహణలో అపచారం జరిగినట్లేగా! 'ప్రకృతిని చూసి ఇంత పరవశించడం తగదు' అని తనని తానే మందలించుకుంది.

"హాఫ్ ఏన్ అవర్ ఓవర్" - "అరగంటయ్యింది" అంటూ రైల్వే ఎనౌన్స్‌మెంట్‌లా రెండు భాషల్లోనూ చెప్పి అందరినీ ఓమారు పరీక్షగా చూసింది.

వెనక బెంచీలోని అమ్మాయి బెదురు చూపులు పార్వతి దృష్టిలో పడ్డాయి. ఆ కళ్ళు, విశాలమైన నుదురు, పల్చని పెదాలూ, ఎవరినో గుర్తుకు తేగా, క్షణం సేపు అచేతనంగా ఆలోచిస్తూ నిలబడిపోయింది. వెంటనే వెళ్ళి పేపర్ స్లిప్‌లను అన్సర్ షీట్ క్రింది నుండి లాగేసుకుంది. సంభ్రమాన్ని అణచుకుంటూ ఆ పిల్ల కళ్ళల్లోకి సూటిగా చూసింది. సూర్య కిరణాల తీక్షతకు కమిలిపోయిన చిన్నారి పువ్వులా, తీవ్ర వాయు వేగానికి అల్లల్లాడిన లతలా వణికిపోయింది ఆ అమ్మాయి - నిండా పదహారేళ్ళు కూడా ఉన్నట్లు లేవు!

వెక్కి వెక్కి ఏడ్వడం మొదలుపెట్టింది.

"నేను ముందే చెప్పానుగా! అయినా చేసేదేదో చేసేసి ఇప్పు డేడిస్తే ఏం ప్రయోజనం?" అంటూ అన్సర్ బుక్ అందుకుని ఎంత కాపీ చేసిందో చూసింది - ఊహూ... ఒక్క అక్షరం కూడా కాపీ చేయలేదు - తను ముందే జాగ్రత్తపడింది. థేంక్ గాడ్!

ఆ పిల్ల ఏడుస్తూనే ఉంది దీనాతిదీనంగా!

"చూడమ్మా! అలా ఏడవకు. ఏడ్చి నలుగుర్లో నవ్వులపాలు కాకు. నీ మూలంగా ఈ గదిలో పరీక్ష రాసే వాళ్ళందరికీ డిస్టర్బెన్స్ అవుతుంది. ఇప్పటికే రెండు నిమిషాలైంది. ఊరుకోకపోతే కాపీ సంగతి ప్రిన్సిపాల్ గారికి రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది... అప్పు... ఏం... మూడేళ్ళు డిబార్ చేయించుకోవాలని సరదాగా ఉందేమిటీ?"

గదమాయించింది పార్వతి - కరిగిపోతున్న హృదయంలోకి కర్కశత్వాన్ని ఎరువు తెచ్చుకుంటూ!

హాల్ టిక్కెట్ చూసి తెలుసుకుంది ఆ అమ్మాయి పేరు చంద్ర వదన అని. బలవంతాన దుఃఖాన్ని ఉగ్గబట్టుక్కూర్చుందా అమ్మాయి. మిగిలిన విద్యార్థులందరూ తమ తమ వ్రాతల్లో మునిగిపోయారు.

ఇదో పెద్ద గొడవ కాకుండా, సులువుగా రెండే రెండు నిమిషాల్లో తేలిపోయినందుకు సంతోషించింది పార్వతి.

కానీ మనస్సులో ఏదో అనుమానం తొలిచేస్తోంది. క్షణ క్షణానికీ ఆత్రుత ఎక్కువైపోతోంది. ఇక ఉండబట్టలేక అటూ ఇటూ తిరుగుతున్నప్పుడు చంద్రవదన దగ్గర క్షణకాలం ఆగి "మీ అమ్మగారి పేరేంటమ్మా పాపా!" అని మెల్లగా అడిగింది. ఎవ్వరికీ వినిపించనటువంటి మంద్రస్థాయి స్వరంతో.

"సునీత" - కోపంగా అం దా అమ్మాయి.

తన అనుమానం నిజమైంది - పార్వతి కాలి క్రింద నేల బీటవడి విచ్చిపోయినట్లయింది. నిలబడలేక గబగబా వెళ్ళి తన కుర్చీలో కూలబడిపోయింది.

"అర్తుల పాలిటి అన్నపూర్ణ - సునీతా మేడమ్ కూతురు ఎంతకు ఒడిగట్టింది? ఆ పుణ్యాత్మురాలి గర్భాన జన్మించిన అమ్మాయి ఇలా ఎలా ప్రవర్తించగలిగింది? ఛీ... ఛీ... తలచుకోవడానికే అసహ్యంగా ఉందే?!" అని తరతరలాడిపోయింది.

పెన్నూ మూసేసి, డస్కు మీద తలవాల్చుకుని కూర్చుంది చంద్రవదన. ఇన్విజిలేటర్ అడిగిన ప్రశ్న ఆమె తలలో గింగిర్లు తిరుగుతోంది.

పెన్ను మూసేసి డస్కు మీద తలవాల్చుకుని కూర్చుంది చంద్రవదన. ఇన్విజిలేటర్ అడిగిన ప్రశ్నే ఆమె తలలో గింగిర్లు తిరుగుతోంది.

"ఎవరి కూతుర్నయితే మాత్రం నాకు ఒరిగేదేముంది? తిండికి మొహం వాచి, యమధర్మరాజులాంటి పెదనాన్న గయ్యాళి గంపలాంటి పెద్దమ్మ పంచన నేనెందు కలా పడుండాల్సి వచ్చింది?... అమ్మ వల్లే కాదూ?... ఒక్క అక్షరమ్ముక్క చదూకోనీకుండా నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునే వరకూ వెట్టి చాకిరీ చేయించుకున్నారు. ఆ బానిస బ్రతుకు బ్రతకలేక, ఆ ఖైదు నుండి తప్పించుకోలేక ఎంత గిలగిలలాడిపోయానో ఎవరికైనా తెలుసా? ఎవరైనా ఆదుకున్నారా? కడుపు నిండేక అందరూ ధర్మ పన్నాలు వల్లించేవాళ్ళే!

ఆ రోజు చావడానికి సిద్ధపడి, బావి దగ్గర కూర్చుని ఏడుస్తుంటే, పక్కింటి శేఖర్ వచ్చి వారించకపోతే, ఈపాటికి పీడా విరగడైపోయేదే. జీవితమ్మీద లేనిపోని ఆశలన్నీ కల్పించే డతడు. పావం పిచ్చివాడు! కాకిని తీసుకొచ్చి కోకిలగా మారుద్దామని సకల ప్రయత్నాలూ చేశాడు. ఏ బీ సీ డీ ల దగ్గర్నుంచీ మొదలెట్టి రహస్యంగా చదువు చెప్పాడు. తన డబ్బుతో మెట్రిక్ పరీక్షకు ఫీజు కట్టాడు.

"ఇదంతా తెలిసి పెదనాన్న పెద్దమ్మలు చిందులు తొక్కినా జంకలేదుగానీ, తన తల్లి, తండ్రీ, అన్నయ్య, స్నేహితుడూ అన్నీ తానే అయి నన్ను తీర్చి దిద్దుతున్న శేఖర్‌పైనే లేనిపోని అభాండాలు వేస్తే సహించలేకపోయింది తను. అసలు సంగతి చెప్పేసింది తను. వాళ్ళు నా ప్రయత్నాన్ని సహించలేదు - అతని దగ్గర చదువుకోడానికి వీల్లేదన్నారు. ఇంట్లోంచి బయటికి కదల్నీలేదు - చదువా మధ్యలో ఆగిపోయింది. పరీక్షలా దగ్గర పడుతున్నాయ్. ఎలాగోలా ఈ పరీక్ష కాస్తా గట్టెక్కిస్తే చాలు ఏ చిన్న ఉద్యోగమో వెతుక్కుని ఈ బానిసత్వం నుండి విముక్తి పొందవచ్చు. అందాకా ఈ చిత్రహింస భరించక తప్పదు. ఇల్లు వదలి పారిపోలేదు. ఎందుకంటే ఏ ఆధారం లేకుండా ఇల్లొదిలిన ఆడపిల్లకి ఏమవుతుందో బాగా తెలుసు.

"హూ...! ఎలాంటి భయంకర పరిస్థితుల్లో కాపీ కొట్టాల్సి వచ్చిందో ఎవరికీ అర్థం కాదు... సిగ్గు విడచి ఇలాంటి పనికెందుకు పూనుకోవలసి వచ్చిందో ఊహించుకోలేరా మేడమ్!" అని అడగాలని తహతహలాడిపోయింది చంద్రవదన. కానీ తన గోడు అరణ్య రోదనే అవుతుందని తెలిసినదై బలవంతాన ఆవేశాన్ని అణచుకుంది.

"మీ కాళ్ళు పట్టుకుంటానండి మేడమ్! ఆ కాగితాలు ఇలా ఇవ్వండి. నన్ను కనికరించి కాపీ కొట్టుకోనిస్తే మీ సొమ్మేం పోదుగదండీ! నేను బ్రతకాలి అంటే నేను పాసవ్వాలి. నేను పాసవ్వాలంటే ఏదో విధంగా వ్రాయాలి. దయచేసి నన్ను వదిలేయండి - కాపీ కొట్టుకోనివ్వండి మేడమ్! నన్ను బ్రతికించండి" అని ఆక్రోశించింది ఆమె అంతరాత్మ. కానీ మాట పెగల్లేదు. ఆ నిశ్శబ్ద వాతావరణం, ఇన్విజిలేటర్‌గారి గంభీర ముద్ర ఆమెను నోరెత్తకుండా చేశాయి. కన్నీళ్ళు కార్చుకుంటూ దయనీయంగా ఆమె వైపు చూస్తూ కూర్చుంది చంద్రవదన.



అమాయకంగా ఉన్న చంద్రవదనను చూస్తూంటే పార్వతి మనస్సు వికలమై పోతున్నది. ఎట్టి తప్పనిసరి పరిస్థితుల్లో ఇలా చేయవలసి వచ్చిందో ఆ అమ్మాయికి.

దేవతలాంటి సునీతా మేడమ్ పట్ల తన కృతజ్ఞత ఇదేనా? - అంటూ అలమటిస్తోంది పార్వతి హృదయం.

"సునీత మేడమ్! మీ అమ్మాయి విషయంలో నేనేమీ చేయలేకపోతున్నాను. పాషాణ హృదయురాల్ని కర్తవ్య నిర్వహణలో తప్పనిసరిగా మీ అమ్మాయికి అపకారం చేయవలసి వస్తున్నది. మీ అడుగుజాడల్లో నడుస్తాను. నన్ను ఆశీర్వదించండి మేడమ్. ధర్మ పరీక్ష నెరవేర్చటందుకు తగిన ధైర్యం నాకు లభించాలని అనుకుంది లోలోపలే!

చంద్రవదన కళ్ళంట ధారలు కారుతున్నాయి.

"మేడమ్! మీరు తల్చుకుంటే నాకు సహాయం చేయగలరు. ఈ అవకాశాన్ని నాకు ఇవ్వగలరు. పరీక్ష ప్యాసు కాకపోతే ఆత్మహత్యయినా చేసుకోవాలి. లేదా ఆ కర్కోటకుల చేతుల్లోనైనా చావాలి తప్ప నాకు మరో గత్యంతరం లేదు. నా పరిస్థితుల్లో మీరుంటే ఏమి చేసేవారు? ఆలోచించండి" అని పరితపించిపోతోంది చంద్ర.

ఆమె మానసిక వేదనని ఇదమిత్థంగా కాకపోయినా, కొంత వరకూ గ్రహించగలిగింది పార్వతి. ఆమె మనస్సు పరిపరివిధాలా భ్రమిస్తోంది - అంతులేని సంఘర్షణ -

"నేను చేసింది ధర్మమేనా?"

"ఒకవేళ కాదేమో?"

"ఛ... ఛ... కాకపోవడమేమిటి? మతిగానీ పోవట్లేదు గదా."

"మతిపోయిందిగానీ, మానవత్వం పోతుందేమో?"

"సయం. ఇదా మానవత్వం?"

"మానవత్వం ముఖ్యమా? - మనిషి కర్తవ్యం ముఖ్యమా?"

"ఏది ముఖ్యం మనుగడకి?"

"ఏది ధర్మం మానవుడికి?"

"సాక్షాత్తూ సునీత మేడమ్ వచ్చి ఆజ్ఞాపిస్తే..."

"అప్పుడు మాత్రం ధర్మం తప్పడమెలా?"

"అసలు ధర్మం అంటే ఏమిటి? సమాజం సుఖశాంతులతో వర్ధిల్లడానికి తనంతట తాను ఏర్పరచుకున్న కట్టుబాటు కాదా ధర్మమంటే?"

"కాదు... అలా ఎంత మాత్రం కాదు. ధర్మం భగవత్స్వరూపం. మానవత్వపు పరమావధిని నిరూపించి, దివ్యత్వపు పొలిమేరల్లోనికి నడిపించగలిగేదే ధర్మం. ధర్మాచరణమనే అసిధారావ్రతంలో సఫలురైన వారినే దేవుడు మెచ్చుతాడు. పిరికివాళ్లను ఇటు మానవుడూ, అటు దేవుడూ - ఎవ్వరూ మెచ్చరు."

పార్వతి మనస్సులో ధర్మసాగర మథనం జరుగుతోంది.

మళ్ళీ గంట మ్రోగింది.

"వన్ అండ్ హాఫ్ అవర్స్ ఓవర్" అన్నది ఉలిక్కిపడి -

ఒక విద్యార్థికి పెన్ కావాలంటే ఇచ్చింది. ప్యూన్‌ని పిలిచి కావలసిన వాళ్లకు మంచినీళ్లు ఇప్పించింది. అందర్నీ వేయి కళ్లతో కనిపెట్టి చూస్తోంది. యాంత్రికంగా ఎడిషనల్ షీట్లు అందిస్తున్నదే కానీ ఆమె హృదయంలో పెను తుఫాను తగ్గలేదు. వరద వెల్లువలా, పొంగుతున్న మనస్సులోకి, ఎక్కడెక్కడి పాత జ్ఞాపకాలో దొర్లుకుంటూ వస్తున్నాయి.


★ ★ ★ ★ ★

ఇదే కాలేజీలో సునీతా మేడమ్ వెయిటింగ్ రూమ్‌కి వచ్చేసరికి, ఓ మూల కూర్చుని వెక్కి వెక్కి ఏడుస్తుం దొక బక్కపలచటి అమ్మాయి - పార్వతి.

"ఎందుకమ్మా అలా ఏడుస్తున్నావు?" - సానుభూతిగా అడిగింది సునీత.

పార్వతి ఏడుపుకు చాలా కారణా లున్నాయ్.

అసలు హాలు టిక్కెట్టు తెచ్చుకోవడం మరిచిపోయింది. తన ఖర్చుకోసమని ఎప్పుడో అప్పు తెచ్చి తండ్రి ఇచ్చిన రూపాయిన్నరా పారేసుకుంది. ఇంగ్లీషు బుక్‌లో రెండు పాఠాలు బుర్ర బద్దలు కొట్టుకున్నా ఎంతకీ అర్థం కాలేదు. ఇప్పుడు వాటిలో ప్రశ్నలు వస్తే - గోవిందో గోవింద. అవతల పెద్ద తమ్ముడికి జ్వరం - ఇంట్లో బియ్యం నిండుకున్నాయి. ఆ పరిస్థితుల్లో ఇంకో ఆడ పిల్ల అయితే అసలు పరీక్షకే వచ్చేది కాదు - అందునా




అంత దూరం ప్రయాణం చేసి.

ఆమె బాధలన్నీ విని జాలిపడింది సునీత.

"ముందు హాల్ టిక్కెట్టు అవసరం - పరీక్షకు ఇంకా రెండు గంటల వ్యవధి ఉంది కదా! తొందరపడి ఇంత ముందుగా ఎందుకొచ్చేశావు? పోనీలే ఇల్లెక్కడో చెప్పు. ఎవర్నయినా పంపించి హాలు టిక్కెట్టు తెప్పిస్తాను" అంది ఆప్యాయంగా.

సుప్రసన్నమయిన ముఖ వర్చస్సుతో మమతా - మానవతా్వలతో తొణికిసలాడే చిర్నవ్వుతో, ఆర్ద్ర హృదయంతో వర్ణించలేనంత అందంగానూ, హుందాగానూ, పొడుగ్గానూ ఉన్న సునీత వైపు దిగ్భ్రమతో చూసింది పార్వతి - తను హిస్టరీలో చదివిన రుద్రమదేవి, ఝాన్సీరాణి ఇలాగే ఉంటారేమో అనుకుంటూ.

తెప్పరిల్లుకుని అడిగింది -

"మీరు... మీరూ...?!"

స్వచ్ఛంగా నవ్వింది సునీత...

"ఎందుకమ్మా! అంత జంకుతావు - నే నీ కాలేజీలో లెక్చరర్ని" - అంది.

నోట మాట రాక, ఆశ్చర్యంగా చూసింది పార్వతి.

"లెక్చరర్లంటే చాలా హుందాగా, గర్వంతో ఉంటారని విందిగానీ, ఈమె ఇలా సామాన్యంగా, కలివిడిగా, ఆప్యాయంగా మాట్లాడుతోందే!" అనుకుంది పార్వతి.

"ఇంతకీ మీ ఇల్లెక్కడ?"

"మాది ఈ ఊరు కాదండి. పది మైళ్ళ దూరంలో గల ఒక చిన్న ఊరు. ఇప్పుడు తప్పితే పరీక్ష వేళకి చేరడానికి మరో రైలు లేదు. అందుకే ఇంత ముందుగా రావాల్సి వచ్చిందండీ! హాలు టిక్కెట్టు మరిచిపోయి రావడంతో ఇన్నాళ్లూ పడిన బాధలూ, శ్రమా బూడిదలో పోసిన పన్నీరైపోయిందండి!..." ఏడుపు వచ్చేసింది - అలాగే కొనసాగిస్తూ - "... ఇంట్లో అమ్మా నాన్నతో పోట్లాడి నేను కష్టపడి మిషన్ కుట్టి సంపాయించుకున్న డబ్బుల్తో ప్రయివేటుగా పి. యు. సి. కట్టాను. ట్యూషనంటూ ఏదీ లేకుండా స్వంతంగా చదువుకున్నాను. ఏమైతే నేం దరిద్రుడి పెళ్లికి వడగళ్ల వాన వచ్చినట్లు - నా పరీక్షకు అన్నీ అడ్డంకులే వచ్చేశాయి. నా శ్రమంతా వ్యర్థమై" - ఏడుపు ముంచుకురాగా గొంతు గద్గదమై మాటలు బయల్వెడలేదు.

ఓదార్పుగా ఆమె భుజం తట్టింది సునీత.

"భలే అమ్మాయివే. ఇంత మాత్రానికే ఇలా డీలా పడిపోతే ఎలా? హాల్ టిక్కెట్టు మరిచిపోయినా ఫరవాలేదులే - నీ కీ కాలేజీలో తెలిసున్న లెక్చరర్లు ఎవరైనా ఐడెంటిఫికేషన్ సర్టిఫికెట్ ఇస్తే పరీక్ష రాయనిస్తారు - మరి నీకు తెలిసున్న వాళ్లెవరైనా ఉన్నారా?" అంది.

"లేరు" అన్నట్లుగా నిస్పృహతో తల తిప్పింది.

సాలోచనలో తల పంకించింది సునీత.

"నువ్వేం బాధపడకు. నిర్భయంగా చదువుకో ప్రశాంతంగా!

"నేను ఇస్తాలే నీకు ఐడెంటిఫికేషన్ సర్టిఫికెట్ - రేపు మాత్రం తప్పకుండా తీసుకుని వచ్చి చూపించాలి సుమా!" అంది.

- తను విన్నది తానే నమ్మలేకపోయింది - ఆ క్షణాన ఒక దేవతలా కనిపించింది సునీత పార్వతి కంటికి.

"ఏమిటి సంగతి?" లోనికి వచ్చిన తోటి లెక్చరర్ ప్రభావతి అడిగింది.

సునీత చెప్పింది -

"ముక్కూ, మొహం ఎరగని వాళ్ళందరికీ ఐడెంటిఫికేషన్ సర్టిఫికెట్లు ఇచ్చి ఉద్యోగం ఊడగొట్టించుకోవాలని ఉందా ఏమిటి? ఏ దరిద్రగొట్టు ఏడుపులకీ కరిగిపోయి గుడ్డిగా నమ్మి నీ పీకల మీదకి తెచ్చుకోవద్దు" అంటూ ఈసడింపుగా చూసింది పార్వతిని.

పార్వతి సిగ్గుతో తల వంచుకుని తన రూపాన్ని ఒకసారి చూసుకుంది - ఎక్కడెక్కడి దరిద్ర స్థితికీ ప్రతిరూపమైనట్లు, లేమికి దర్పణమైనట్లు ఉంది తను.

"నీతి ప్రౌఢ విహారులైన నిపుణులే నిందింపనీ, మెచ్చనీ ఖ్యాతిన్ జెందిన సంపదల్ నిలువనీ, గాఢంబుగా సాగనీ!" ధర్మం విషయంలో చలించదు సునీత।

"అదేమిటి ప్రభా! కష్టాల్లో ఉన్న వాళ్లను ఆదుకోవడమే మానవ ధర్మం కదా! ఆ అమాయకపు మొహంలో ఎంతో క్షోభ; ఆరాటం కనిపిస్తోందిగానీ మోసం లేశమైనా కనిపిస్తోందా!"

"ఆఁ! మొహాలు చూసి నువ్వు నమ్మడం మొదలు పెట్టావంటే అంతే! మోసగాళ్లంతా ఎంతో అమాయకంగా కనిపిస్తారు. వాళ్లని గుడ్డిగా నమ్మేయకూడదు - నీతినిజాయితీలకుస్థానం లే దీ రోజుల్లో" - హితోపదేశం చేసింది ప్రభావతి.

"మనలో లేనిదాన్ని ఇతరులలో చూడలేము - మనము నిజాయితీగా ఉంటే, ఎదుటి వాళ్లలో నిజాయితీని గుర్తించగలము. మనం మంచివాళ్లమైతే ఈ లోకమంతా మంచిదవుతుంది. ఎప్పటికైనా అన్ని అడ్డంకులన్నీ అధిగమిస్తూ మంచితనమే గెలుస్తుంది - "నీకు దరిద్ర మోసగత్తెలా కనిపించిన ఈ అమ్మాయి నాకు అమాయకురాలిలా కనిపించింది. ఇవ్వు దీ అమ్మాయికి సర్టిఫికెట్ ఇస్తాను - నా ఉద్యోగాన్ని పణంగా పెట్టి. ఫలితం చూద్దామా?" అంది సునీత చెక్కు చెదరని ఆత్మ విశ్వాసంతో.

పార్వతి రెప్పవాల్చలేదు - పెదాలు కదలలేదు - చెవులు రిక్కించుకుని ఇదంతా వినేటప్పటికి - సునీతా మేడమ్ "దేవతే" అనిపించింది పార్వతికి.

"సరే అలాగే చేయి. చేసే ముందు మరొక్కసారి ఆలోచించి విజ్ఞతతో ప్రవర్తించు. నీ కంటే సీనియర్ని నీ మేలు కోరి చెప్పాను. ఇలాంటి వాళ్లు అమాయకుల్లా కనిపించి చివరికి తడి గుడ్డతో గొంతు కోస్తారు" అని ప్రబోధించి నిష్క్రమించింది ప్రభావతి.

సునీత బాధగా నిట్టూర్చింది - పాలు, బిస్కెట్లూ, తెప్పించి మొహమాటపడుతున్న పార్వతి చేత బలవంతాన తినిపించింది. తండ్రి చేసే గుమాస్తా ఉద్యోగం గురించీ, అక్కల పెళ్లి సమస్యల గురించీ, తన చదువు సమస్య గురించీ పార్వతి చెప్పగా సానుభూతితో వినది సునీత - అర్థంగాని రెండు పాఠాలూ చెప్పి ఐడెంటిఫికేషన్ సర్టిఫికెట్ వ్రాసి చేతిలో పెట్టింది. ఆనందమూ, కృతజ్ఞతా ఒక్కసారే పెల్లుబకగా హృదయం బరువెక్కి, నోట మాటరాక, సునీత కాళ్లపై పడిపోయింది పార్వతి.

"ఇదేంటమ్మా - లే, లే! పరీక్ష వ్రాయి - ధైర్యంగా" అంటూ పైకి లేపి, చేతిలోని అయిదు రూపాయల నోటును పార్వతి చేతిలో పెట్టి గుప్పిటి మూసేసి వెళ్లిపోయింది సునీత.

"తథాస్తు" అన్నట్లుగా ఫస్ట్ బెల్ మ్రోగింది.

ఆ రోజు... ఎండి బీటలువారిన పార్వతి హృదయంలో తొలకరి వాన కురిసింది - చీకటి నిండిన ఆమె జీవితంలో వెలుగు నిండింది - దుఃఖప్లావితమైన ఆమె మనస్సులో ఆనందపు ఆశాలత మొలకెత్తింది.

* * * * *

ఆ తర్వాత రోజు -

పరీక్ష రాసేసి వెళ్లిపోయే ముందు మరొకసారి కలిసి వెళదామనే కోరికతో స్టాఫ్ రూమ్‌లోనికి వెళ్లబోతున్న పార్వతి, లోపల ప్రభావతీ - సునీతల మాటలు విని తక్కున ఆగిపోయింది.

"నువ్వు పార్వతిని అనుమానించావుగానీ ప్రభా! ఇవాళ వచ్చీ రాగానే హాల్ టిక్కెట్టు తెచ్చి చూపించింది నా అయిదు రూపాయలూ ఇచ్చేసింది - పిల్ల చాలా బుద్ధిమంతురాలు - ఇప్పటికైనా నన్ను సమర్థిస్తావా?" సునీత.

"అద్సరే పోనీ? - మాధవ్ విషయమే చెప్పు! అమాయకుడు అన్నావు - పసివాడి మనస్తత్వమన్నావు. ఎమ్మే చదివిన నువ్వు బియ్యే చదివిన మాధవుని ఆరాధించావు - ఆగర్భ శ్రీమంతుల ఇంట పుట్టి, ఆభిజాత్యంతో అగ్రశ్రేణికి చెంది, గర్భ దరిద్రుణ్ణీ; తక్కువ కులం వాడ్నీ పెళ్లాడేవు. కన్న వాళ్లనీ, ఉన్న ఆస్తినీ కాలదన్నుకున్నావు. తీరా చూశాక - అత డొక దగాకోరనీ, వ్యసనాల బానిసనీ తెలిసిందా, లేదా! అక్కడ నీ నమ్మకం ఏమయ్యింది - భర్తను ఎంచుకోవడంలోనే మోసపోయినదానివి ఇతరులనేం ఉద్ధరిస్తావ్?" వ్యంగ్యంగా అంది ప్రభావతి.

సునీత గొంతు వణుకుతున్నది -

"ప్రభా! వారినేమీ అనొద్దు - చెడ్డవారే కావచ్చు కానీ నన్ను ప్రాణప్రదంగా చూసుకుంటున్నా రాయన. ఆ కది చాలు. చెడు స్నేహాల వల్ల అలా అయ్యారు కానీ, ఆయన స్వతహాగా మంచివారు. నెమ్మది మీద-ఆయన్ను మార్చుకోగలను. నా కా ఆశ ఉంది ప్రభా!" ఉద్వేగంగా అంది.

"ఆశ ఉందట - ఆశ - రోజూ అతని చేతిలో దెబ్బలు తింటూ కూడా అతన్ని మార్చగలను అని ఆశపడుతున్నావా? నీ అమాయకత్వాన్ని చూసి జాలేస్తోంది - తాగుడు వ్యసనం గలవాడు, పరస్త్రీ లోలుడు - భార్య మాటలు వింటాడా? విని మారిపోతాడా! ఎంత హాస్యాస్పదంగా ఉంది - సినిమాల్లోనో, నవలల్లోనో విహరించకు సునీతా!" హేళనగా ప్రభ అంది -

శరీరమంతా గాయం చేసి ఉప్పూ కారం అద్దినట్లు గిజగిజలాడిపోయింది సునీత -

"ప్రభా! ప్లీజ్. నా ప్రయత్నమేదో, నా బాధేదో నేను పడతానుగానీ, ప్రతి రోజూ నన్నిలా వెక్కిరించకు. ప్రభా!" అంటూంటే కనుల వెంబడి దుఃఖం కాలువలు కట్టింది. "పెళ్లికి ముందు చెప్తే నువ్వు వినిపించుకోలేదు మరి - నేనే కాదు సునీతా! ఎవరైనా ఇలాగే అంటారు గదా" అంది ప్రభ.


పార్వతి మెదడు మొద్దుబారి - వెనుతిరిగింది.

* * * * *

రిజల్ట్స్ వచ్చిన పేపరు పట్టుకుని దాదాపు ఉరకలు పరుగులు లాంటి నడకతో వచ్చింది పార్వతి.

"మేడమ్! నాకు బియ్యేలో క్లాసు వచ్చిందండీ! ఇదంతా మీ భిక్షే! ఈ కూపస్థమండూకాన్ని ఉద్ధరించారు. మీరు స్కాలర్ షిప్ ఇప్పించి పుస్తకాలు కొని ఇచ్చి పాఠాలతో బాటు ధైర్యం చెప్పి దీనత్వంతో కుంగిపోతున్న నాలో ఆత్మ విశ్వాసాన్ని రంగరించిపోశారు. విద్యా భిక్ష పెట్టారు. మీరు చేసిన సాయం ఎవరు చేస్తారు? ఎన్ని జన్మలెత్తి మీ ఋణం తీర్చుకోగలను? గురుదక్షిణగా ఏమిచ్చుకోగలను మేడమ్!" అని గడగడా చెప్పేసింది ఆనందమూ, కృతజ్ఞతా మిళితమైరాగా!

"ఋణమూ, గురుదక్షిణ, ఏమి టమ్మాయ్! నేను నీకు ప్రత్యేకంగా చేసిందేమిటి? కుతూహలం, జిజ్ఞాస, సామర్థ్యం ఉన్న విద్యార్థుల్ని ప్రోత్సహించడం ఒక ఉపాధ్యాయినిగా నా ధర్మం కాదా - నా విధ్యుక్త ధర్మాన్ని నెరవేర్చాను అంతే!"



కృష్ణుని మాటలు వింటున్న అర్జునుడిలా వింటోంది పార్వతి!

"ఉపాధ్యాయ వృత్తి చాలా మహత్తరమైనదమ్మా! ఎందరో భావి భారతీయుల భవిష్యత్తును మలచి తీర్చగల కార్ఖానా ఇది - మన విధి నిర్వహణలో చేసిన తప్పిదాల వల్ల ఎందరి - జీవితాలో పతనమయ్యే ప్రమాదం ఉంది. అందుకే ప్రతి క్షణం ఉపాధ్యాయులైన ప్రతి వారూ జాగ్రత్తగా ఉండాలి. విద్యార్థులకు ప్రేమాభిమానాలను కూడా పంచుతూ వారి భావి కుపకరించేలా బోధించాలి! - ఈ విషయాలు దృష్టిలో ఉంచుకుని, నా ఆశయాలకు తగినట్టుగా నీవు కూడా ఉపాధ్యాయ వృత్తి చేపడితేనే నాకు తృప్తి!" అని అంది సునీత.

"సరిగ్గా నాకు కూడా ఇదే కోరిక కలిగింది, మేడమ్! ఏనాడైతే మిమ్మల్ని మొదటిసారిగా కలుసుకున్నానో, ఆ రోజే నాలో ఒక అవ్యక్తమైన కోరిక దృఢపడసాగింది. మీలాంటి ఉపాధ్యాయినిగా అవ్వాలనీ - మీ కోరికా, నా ఆశయం అదే అయినప్పుడు ఎంత కష్టమైనా సరే, నేను ఉపాధ్యాయురాలినిగా అయి, మిమ్ములను ఆదర్శంగా ఉంచుకుని, మీ ఆదర్శాల కనుగుణంగా నా విధి నిర్వర్తిస్తాను" అని వాగ్దానం చేసింది పార్వతి.

సునీత కళ్లు చెమర్చాయి -

★ ★ ★ ★ ★

ఎప్పాయింట్‌మెంట్ ఆర్డరు చేత్తో పట్టుకుని ఉత్సాహంగా వచ్చింది పార్వతి - "ఎమ్మే - ఈ విద్యాభిక్ష, ఈ ధైర్య భిక్ష - సమస్తమూ సునీతా మేడమ్ ప్రసాదమే - అందుకే ముందుగా ఆమె పాదాలంటి నమస్కరించాలి. ఈ కాలేజీలోనే, మేడమ్‌లో కలిసి ఉద్యోగం చేయడం ఎంత మధురంగా ఉంది" అనుకుంటు ఉరకల పరుగులాంటి నడకతో డిపార్ట్‌మెంట్‌లోనికి వచ్చింది -

సునీత లేదు - ప్యూన్‌ని పిలిచి అడిగింది -

"అయ్యో తల్లీ - ఇంకెక్కడి సునీతగోరమ్మా! ఏ మొచ్చిందో ఏమో - ఆ మాయదారి మొగుడు తాగొచ్చిన మైకంలో కత్తి పీట విసరి కొట్టాడట ఆ తల్లికి. పచ్చి బాలింతరాలు కదా! దెబ్బ బాగా తగిలిందేమో - అప్పుడే మొగుడి చేతిలోనే ప్రాణాలు వదిలేసింది. అతను మాత్రం పోలీసుల దగ్గరికెళ్లి పట్టుబడి పోయాడంట! శానా ఏళ్లు శిచ్చ ఏశారంట! ఆయమ్మ కన్నోళ్లెవరూ తొంగిసూడాపోతే, ఇరుగింటోళ్లు, పొరుగింటోళ్లు అందరూ కూడబలుక్కుని ఆ పసి కూనను తీసుకపోయి, ఆ అమ్మాయి పెదనాన్న ఇంటికాడ వదిలి వచ్చేరట - అత దో కసాయి..."

ఇంక అతను చెప్పే మాటలు వినపడలేదు పార్వతికి. క్రింద భూమి దద్దరిల్లినట్లయి - కళ్లు తిరిగినట్లయింది. గిలగిల తన్నుకుపోయింది పార్వతి హృదయం.

"మేడమ్! జీవితమంతా ఏ మంచితనాన్ని నమ్మి ఆచరించారో ఆ మంచితనానికే బలైపోయారా చివరికి! అలవి మీరిన క్రూరత్వానికి బలైపోయారా?" అని బావురుమంది పార్వతి.

"చిక్కని చిరునవ్వుతో, నవనీతం లాంటి అంతరంగంతో ఏ విద్యార్థికి కష్టం వచ్చినా, వెంటనే ప్రత్యక్షమై, ఆదుకునే దేవత సునీతా మేడమ్ - ఇక కనిపించరు. ఆమెలేని లోటుతో ఆ కాలేజీలోనే ఎలా పనిచెయ్యను?" అని రాత్రింబవళ్లు ఆక్రోశించింది. ఆమె ఇంట్లో సునీత ఫోటో వెలిసింది - రోజూ నమస్కరించిగాని ఏ పని ముట్టుకోదు పార్వతి.

★ ★ ★ ★ ★

కాలచక్రం గిర్రున తిరిగిపోయింది - ఈనాడు పార్వతి చందమామల్లాంటి ముగ్గురు పిల్లలతో, అభిమానించే భర్త గల ఒక సంపూర్ణ గృహిణి. సునీత ఆదర్శాలను పాటిస్తూ - విద్యార్థులపై వాత్సల్యాన్ని కురిపించే ఆదర్శ ఉపాధ్యాయిని పార్వతి.

ఆమె మనస్సులో తీవ్ర సంఘర్షణ జరుగుతూ ఉంది -

తన కింత సహాయం చేసి ఈనాటి తన హోదాకి కారణభూతురాలైన సునీతా మేడమ్ కూతురు నిస్సహాయ స్థితిలో పరీక్ష వ్రాయలేకుండా కాపీ కొడుతూ పట్టుబడినా, ఆ మేడమ్‌పై గల అభిమానానికి, ఆమె చేసిన సహాయానికి కృతజ్ఞతగా ఆ అమ్మాయి చేతికి స్లిప్పులు తిరిగి ఇచ్చి వ్రాయించగలదు.

కానీ అది సునీతా మేడమ్ పట్ల కృతజ్ఞత అవుతుందా, కృతఘ్నత అవుతుందా? తేల్చుకోలేకపోతోంది పార్వతి!

గంట మ్రోగడంతో ఒక్కసారిగా వాస్తవంలోనికి వచ్చింది -



"హాఫ్ ఎన్ అవర్ మోర్" అంటూ హెచ్చరించింది విద్యార్థుల్ని. అందరూ బుద్ధిగా వ్రాసుకుంటూ పోతున్నారు. 'చంద్ర' ని చూసింది. అలాగే ఏడుస్తూ విచార వదనంతో కూర్చుండిపోయింది.

చంద్ర పరిస్థితి అలాగే ఉంది - ఇటు ఇంట్లో వాళ్ల అభీష్టానికి వ్యతిరేకంగా తను ఈ పరీక్ష వ్రాయ సంకల్పించింది. ఏదో రకంగా ఈ పరీక్షలో ప్యాస్ కావడమే ధ్యేయంగా పెట్టుకుంది. పరిస్థితు లనుకూలించక చదవలేకపోయింది. కానీ ధ్యేయాన్ని చేరుకోవాలని, అలా అయినప్పుడే తన జీవితంలో కష్టాలు తీరతాయి. లేకుంటే చావే శరణ్యం - అని భావించి తప్పుడు మార్గమని తెలిసినా తెగించింది. కాని అనుభవం లేక వ్రాయలేకపోయింది. ధ్యేయం తన కళ్ల ముందే కూలిపోగా దిక్కు తోచని స్థితిలో అలాగే కూర్చుండిపోయింది చంద్ర.

ఎటూ తేలని సందిగ్ధావస్థలోపడింది పార్వతి. తనిప్పుడు ఏం చేయాలి? ఏం చేసి సునీత పట్ల తన కృతజ్ఞతను వ్యక్తపరచుకోవాలి? అటువంటి అవకాశం తనకి ఉండి కూడా ఎందుకు చేయలేకపోతోంది తను? ఆ కాగితాలు అమ్మాయికి ఇచ్చి రాసుకోమంటే, ఉన్న ఈ అరగంటా చాలు ఆ అమ్మాయి పాస్ మార్కులు తెచ్చేసుకునేంత వ్రాయడానికి -

'ఛీ... ఛీ... ఏమిటీ నువ్వు చేస్తున్న ఆలోచన? ఇలా చేస్తే సునీతా మేడమ్‌ని అగౌరవపరచినట్లు కాదా? ఆదర్శాలు తను పాటిస్తూ, ఆ ఆదర్శాలను పాటించేందుకై నిన్ను ఒక ఉపాధ్యాయురాలినిగా చేసి, గురుదక్షిణగా నిన్ను ఆ ఆదర్శాలను తప్పకుండా పాటించమని కోరిన మేడమ్ ఆత్మ శాంతిస్తుందా? దీనికేనా నిన్ను ఇంతలా పెంచి పెద్ద చేసినంత దానిలా చేసింది? ఇది ఆమె పట్ల చూపే కృతజ్ఞత ఎలా అవుతుంది?" హెచ్చరించింది అంతరాత్మ.

ఈ అంతర్మథనం, సంఘర్షణ కొనసాగుతూనే ఉన్నాయి. పిల్లలకు అడిషనల్ షీట్లు ఇస్తూనే ఉంది యాంత్రికంగా. ఆలోచిస్తూ ఉండగానే -

సమయం దగ్గరపడింది - ఇంక అయిదు నిమిషాలే ఉంది -

"ఓన్లీ ఫైవ్ మినిట్స్ మోర్ - ముందు మీ ఆన్సర్ షీట్లు, అడిషనల్ షీట్లు దారంతో కట్టేయండి" అంటూ ట్వైన్ దారముక్కలు అందరికీ అందజేస్తుంది.

చంద్ర గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి -

ఇంకో అయిదు నిమిషాల్లో తను బయటపడాలి - ఎక్కడికి వెళ్లాలి - తన ధ్యేయం విచ్ఛిన్నమైన తర్వాత ఎలా బ్రతకాలి - బ్రతికి ఏం ఉపయోగం - అందుకే ఒక నిర్ణయానికి వచ్చేసింది చంద్రవదన - అదే ఆత్మహత్య!

అలాగే పార్వతి కూడా ఆలోచించింది.

"ఇంకో అయిదు నిమిషాల్లో ఆ అమ్మాయి బయటికి వెళ్లిపోవాలి. కాగితాలిచ్చి సహాయం చేసే ప్రసక్తి లేనే లేదు - ఏం చెయ్యాలి?!"

గంట మ్రోగింది - పిల్లల చేతిలో నుంచి ఆన్సర్ షీట్లు తీసుకుంది - అందరూ వెళ్లిపోయారు ఒక్క చంద్రవదన తప్ప.

చంద్ర వదనని చూసింది. నిస్సహాయంగా నిలుచుని ఉంది. బయటికి వెళ్లలేదు.

ఆమెలో ఆనాటి పార్వతిని చూసింది నేటి సునీత మలచిన పార్వతి. చటుక్కున ఏదో మెరుపు లాంటి ఆలోచన వచ్చి, ఒక పరిష్కారం దొరికింది. సునీతా మేడమ్ ఆదర్శాల కనుగుణంగా ఆమె బాటలోనే పయనించాలన్న నిర్ణయానికి వచ్చింది పార్వతి.

మాతృ హృదయం ఉప్పొంగగా - "పదమ్మా! మనింటికి పోదాము" అని చంద్రపై చేయివేసింది ఆప్యాయంగా.